పకడ్బందీగా ఎన్నికల ఏర్పాట్లు


శ్రీకాకుళం రూరల్: పోలింగ్ బూత్‌లను పరిశీలిస్తున్న అధికారులు, పోలీసులు

- రేపటి పోలింగ్‌కు సర్వం సిద్ధం
- తహశీల్దార్ వెంకటరావు వెల్లడి

శ్రీకాకుళం రూరల్: ఈ నెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని శ్రీకాకుళం రూరల్ మండల తహశీల్దార్ ఎస్.వెంకట్రావు శనివారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలో పది పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామన్నారు. ఖరారు చేసిన ఓటరు జాబితా మేరకు ఓటరు స్లిప్పులను బీఎల్‌ఓలకు, వార్డు రెవెన్యూ సెక్రటరీల ద్వారా పట్టభద్రులకు పంపిణీ చేశామన్నారు. శ్రీకాకుళం రూరల్ పరిసర ప్రాంతాలకు చెందిన ఓటర్లు అందరూ శ్రీకాకుళంలోని పీఎస్ఎన్ఎం స్కూల్లోని రెండు పోలింగ్ బూత్‌లలో ఓట్లు వేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఈ నెల 13న (సోమవారం) పట్టబద్రుల ఎన్నికలు జరగనున్నాయి. ఓటర్లు గుర్తింపుకార్డును తప్పనిసరిగా తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగర పరిధిలో పీఎస్ఎన్ఎం సూక్ల్‌తో పాటు ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల, ఎన్టీఆర్ పురపాలక పాఠశాల, ప్రభుత్వ బాలికల హైస్కూల్, టీపీఎం హైస్కూల్లోనూ పోలింగ్ జరుగుతుందని వివరించారు.

స్ట్రాంగ్‌రూమ్‌లు సిద్ధం..

ఎచ్చెర్ల క్యాంపస్: పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహణ ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి రిసెప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆదివారం ఇక్కడి నుంచి శ్రీకాకుళం డివిజన్‌లో ఏర్పాటు చేస్తున్న పోలింగ్ కేంద్రాలకు బ్యాలెట్లు, బ్యాలెట్ బాక్సులు, ఇతర సామగ్రి తరలించనున్నారు. మరోవైపు ఎచ్చెర్ల మండల కేంద్రంలో ఓట్ల సంఖ్య బట్టి రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గ్రామ సచివాలయాల ద్వారా ఎన్నికల సంఘం అందజేసిన స్లిప్‌లను ఓటర్లకు చేరవేస్తున్నారు. ఎన్నికలు అనంతరం బ్యాలెట్లు భద్రపర్చేందుకు స్ట్రాంగ్ రూంలు, కౌంటింగ్ కేంద్రాలను సైతం శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో సిద్ధం చేస్తున్నారు. ఈ మేరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.


కౌంటింగ్ కేంద్రం


శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రం


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం

గెలుపును కానుకగా ఇద్దాం


జి.సిగడాంలో కార్యకర్తలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్

జి.సిగడాం:

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి నర్తు రామారావులను అత్యధిక మెజారిటీతో గెలిపించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా ఇద్దామని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. శనివారం జి.సిగడాంలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొదటి ప్రాధాన్యతా ఓటు సుధాకర్‌కు వేసి ఉత్తరాంధ్ర లోనే ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి అత్యధిక మెజారిటీతో ఓట్లు పడేలా చొరవ తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల నియోజకవర్గ పరిశీలకుడు నెక్కల నాయుడుబాబు, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు మీసాల వెంకటరమణ, జెడ్పీటీసీ కాయల రమణ, మండల పార్టీ నాయకులు బూరాడ వెంకటరమణ, జేసీఎస్ కన్వీనర్ డోల వెంకటరమణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మక్క వెంకటసాయి, పీఏసీఎస్ చైర్మన్ ఎర్నేన ప్రకాశరావు, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వాన ప్రమీల, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాజధాని కోసం..

ఎచ్చెర్ల క్యాంపస్: ఉత్తరాంధ్ర ప్రగతికి కృషిచేస్తూ విశాఖపట్నం పాలనా రాజధానిగా ప్రకటించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మద్దతు ప్రకటించిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని వికేంద్రీకరణ జేఏసీ చైర్మన్, పూర్వపు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ పిలుపునిచ్చారు. ఎచ్చెర్లలో శనివారం ఆయన మాట్లాడుతూ విశాఖ రాజధానిగా వద్దన్న పార్టీలకు ఓట్లు వేయవద్దన్నారు. ఉత్తరాంధ్ర ప్రగతికి విశాఖ రాజధాని ఏర్పాటు అవసరమని చెప్పారు. పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి సుధాకర్‌కు మద్దతు ఇవ్వాలని కోరారు.


ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్

సుధాకర్‌ను గెలిపిద్దాం

గార: వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను ఎమ్మెల్సీగా గెలిపించుకుని, విశాఖపట్నం రాజధానిగా చేసుకుందామని ఎంపీపీ గొండు రఘురామ్ అన్నారు. శ్రీకూర్మం జంక్షన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సచివాలయ వ్యవస్థ ద్వారా పెద్ద ఎత్తున ఉద్యోగాలు కల్పించి న ఘనత వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. అవినీతి రహిత పాలనతో పాటు సంక్షేమాన్ని పెద్ద తీసుకువెళ్తున్న పరిస్థితుల్లో యువత ఆలోచించాలని కోరారు.


గార ఎంపీపీ గొండు రఘురామ్

మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి..

ఎచ్చెర్ల క్యాంపస్: వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఎస్ఎంపురం పీఏసీఎస్ అధ్యక్షుడు సనపల నారాయణరావు పిలుపునిచ్చారు. ఇబ్రహింబాద్, తోటపాలేం, పూడివలస గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కళ్లేపల్లి తిరుపతిరావు, నాయకులు సూర అప్పారావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.


ఎచ్చెర్ల క్యాంపస్: ఇబ్రహింబాద్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

క్లుప్తంగా

ఉగాది పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శోభకృత్ నామ తెలుగు ఉగాది పురస్కరించుకుని ఉగాది విశిష్ట ప్రతిభారత్న–2023 అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సర్వేజనా సుఖినోభవంతు వ్యవస్థాపక అధ్యక్షుడు ఈఎస్ఎన్ నారాయణ స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కవులు, రచయితలు, విద్యావంతులు, ఉపాధ్యాయులు, మేధావులు, వైద్యులు, సమాజ సేవకులు, ఆధ్యాత్మిక, యోగా గురువులు, కార్మికులు, కర్షకులు, క్రీడాకారులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9652347207 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ట్రిపుల్ ఐటీలో వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ)లో శనివారం రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. విద్యా సంక్షేమ సేవాసంస్థ, జాతీయ సేవాపథకం సంయుక్తంగా చేపట్టిన ఈ శిబిరంలో డాక్టర్ శరత్, డాక్టర్ భారతి విద్యార్థులను పరీక్షించారు. అనంతరం విద్యార్థులకు పలు సూచనలు చేశారు. శిబిరాన్ని డైరెక్టర్ పెద్దాడ జగదీశ్వరరావు పర్యవేక్షించారు.

శతశాతం ఫలితాలే లక్ష్యం


మాట్లాడుతున్న హెచ్‌ఎం శ్రీనివాసరావు

లావేరు: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులంతా ఉత్తీర్ణత సాధించేలా తల్లిదండ్రులు సైతం సహకరించాలని కేశవరాయునిపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ముల్లు శ్రీనివాసరావు కోరారు. శనివారం పాఠశాలలో తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ పరీక్షలపై భయం వీడాలన్నారు. ప్రతిరోజూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. సమావేశంలో సీఆర్‌పీ పి.మహేశ్వరం తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు


బొడ్డపాడులో పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం

లావేరు: పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేస్తున్నట్లు బెజ్జిపురం, లావేరు పశువైద్య కేంద్రాల డాక్టర్లు జి.లావణ్య, బి.గాయత్రి అన్నారు. బొడ్డపాడు, లింగాలవలస, బెజ్జిపురం, వాళ్లేపేట, గుమడాం, లావేరు గ్రామాల్లో శనివారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ నెలాఖరు వరకూ ఉచితంగా టీకాలు వేస్తామని, పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్లు జి.గోపాల్, జి.లక్ష్మీకాంతం పాల్గొన్నారు.

శాంతిభద్రతలపై దృష్టి


మాట్లాడుతున్న ఎస్‌ఐ రామారావు

జి.సిగడాం: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎస్‌ఐ సామంతుల రామారావు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న మండల కేంద్రంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలు సజావుగా సాగేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. పోలింగ్ కేంద్రం వద్ద 144 సెక్షన్ విధిస్తున్నట్లు తెలిపారు. గొడవలకు దిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సేంద్రియ ఎరువులతో భూమి సారవంతం


అవగాహన కల్పిస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాసరావు

లావేరు: సేంద్రీయ ఎరువుల ద్వారా పంటలు సాగు చేస్తే భూమి సారవంతమవుతుందని గీతం యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. కొత్తకోటలో శనివారం సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువులను అధికంగా వినియోగించడం వల్ల నేల నాణ్యతపై ప్రతికూల ప్రభావం చూపి భూమి నిస్సారంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఏ రొక్కం అనిల్‌కుమార్, సచివాలయం ఎంఎస్‌కే రేవతి, ఎస్‌పీవో శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యభారత్ సాధనే లక్ష్యం

శ్రీకాకుళం అర్బన్: ఆరోగ్యమే మహాభాగ్యంగా, సమాజమే దేవాలయం అన్న నినాదంతో వాకర్స్ కుటుంబ సభ్యులు మెలగాలని వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ చైర్మన్, స్టార్ డోనర్ కె.రామానందం అన్నారు. శనివారం శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రాంగణంలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్మించనున్న యోగాభవన్ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ వాకర్ సామాజిక సేవలో పాల్గొనాలని, మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి పదిమందికి తోచిన రీతిలో సేవలు అందించాలన్నారు. యోగా భవన్ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ చీఫ్ కో-ఆర్డినేటర్ పీజీ గుప్తా, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు శాసపు జోగినాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ మాజీ ఏరియా వైస్ ప్రెసిడెంట్ విజయలక్ష్మి, 102 గవర్నర్ కె.సత్యం, మాజీ గవర్నర్లు జి.ఇందిరాప్రసాద్, గుడ్ల సత్యనారాయణ, కేవీఆర్ మూర్తి, వూన్న కామేశ్వరరావు, ఎస్.సంజీవరావు, ఎస్.ఈశ్వరరావు, బి.దేవీప్రసాద్, గోలీ ఉమా, సంతోష్, గంజి ఎజ్రా, నల్లబాటి కృష్ణమూర్తి, గేదెల లక్ష్మి, మారుతీ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు కొంక్యాన మురళీధర్, డిప్యూటీ గవర్నర్ ఊన్న నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.


రామానందం బృందాన్ని సత్కరిస్తున్న జిల్లా వాకర్స్ సంస్థ ప్రతినిధులు

నేటినుంచి పైడితల్లి అమ్మవారి జాతర

పొందూరు: ఉత్తరాంధ్ర భక్తుల కల్పవల్లి పొందూరు గ్రామదేవత పైడితల్లి అమ్మవారి 38వ యాత్ర ఆదివారం నుంచి ప్రారంభమవుతోంది. మూడు రోజులపాటు యాత్రను నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు శనివారం తెలిపారు. ఈ జాతరకు శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు రానున్నారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు రోజంతా అన్నసమారాధనను వ్యాపారవేత్త కాకర్ల పైడిలింగం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుంది.

కొండచిలువ హతం


రైతులు హతమార్చిన కొండచిలువ

పోలాకి: మబగాంలో చెరకు తోటల్లో సుమారు 20 అడుగుల కొండచిలువను శనివారం రైతులు హతమార్చారు. స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు పక్కనే ఉన్న కొండచిలువను చూసి అటుగా వెళ్లిన స్కూల్‌పిల్లలు భయాందోళనకు గురయ్యారు. మరికొంతమంది అక్కడి చేరి చూసేసరికి అప్పటికే చనిపోయి ఉన్నట్లు గుర్తించారు. వరదల సమయంలో కొండ ప్రాంతం నుంచి ఇటువంటి పాములు కొట్టుకొస్తుంటాయని చెబుతున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అవనాపు విక్రమ్

రణస్థలం: వైఎస్సార్ సీపీ యువజన విభాగం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల జోనల్ ఇన్‌చార్జిగా నియమితులైన అవనాపు విక్రమ్ శనివారం ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్‌ను రణస్థలంలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతమయ్యేలా సమన్వయంతో కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు నెక్కల నాయుడుబాబు, రాష్ట్ర ఫైనాన్స్ మహిళా కార్పొరేషన్ చైర్మన్ బల్లాడ హేమామాలిని రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే కిరణ్‌ను సత్కరిస్తున్న యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి విక్రమ్

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని మండలవీధికి చెందిన పూతి తిరుపతిరావు రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఒకటో పట్టణ ఎస్‌ఐ గణేష్ తెలిపారు. తిరుపతిరావు భార్య కొద్దిరోజుల కిందటే చనిపోయింది. ఇద్దరు పిల్లలున్నా భార్య చనిపోయిందన్న మనస్థాపంతో మనోవేదనకు గురైన తిరుపతిరావు ఈ నెల 3న తన మంచం కింద కొవ్వొత్తి పెట్టుకుని నిద్రించగా వేకువజామున మంటలు చెలరేగడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే కుటుంబ సభ్యులు రిమ్స్‌లో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందారు.

పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ వర్తించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర శిష్టకరణ సంఘం అధ్యక్షుడు పోలుమహంతి ఉమామహేశ్వరరావు తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావుని కోరారు. విశాఖపట్నంలో శనివారం జరిగిన జాతీయ ఉద్యోగుల ప్రతినిధుల మహాసభలో పోలుమహంతి మాట్లాడుతూ ఓబీసీ రిజర్వేషన్ అమల్లో బ్యాక్‌లాగ్ విధానం అమల్లోకి తేవాలని, నాన్ క్రిమిలేయర్ ఆదాయ పరిమితిని రూ.20 లక్షలకు పెంచాలని, సామాజిక ఆర్థిక కుల గణన 2011 వివరాలను రాష్ట్రాల వారీగా అధికారికంగా వెల్లడించాలని కోరారు. దేశంలో మెజార్టీ జనాభా కలిగిన ఓబీసీలను నిర్లక్ష్యం చేయడం తగదని, అన్ని రంగాల్లో వారి జనాభా మేరకు వాటా దక్కేలా చూడాలన్నారు. బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు.


కృష్ణమోహన్‌కు వినతిపత్రం అందించిన పోలుమహంతి ఉమామహేశ్వరరావు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

మెళియాపుట్టి: మండలంలోని చాపర గ్రామంలో పెను ప్రమాదం తప్పింది. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో పలాస వైపునుంచి మెళియాపుట్టి వైపు ఓ కారు శరవేగంగా దూసుకువస్తూ అదుపుతప్పి చాపర మెయిన్ రోడ్డు ప్రాంతంలో ఉన్న విద్యుత్ స్తంభానికి బలంగా ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జునుజ్జు అయింది. సేఫ్టీ బెలూన్స్ తెరుచుకోవడంతో కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడినట్లు స్థానికులు తెలిపారు. హిరమండలం మండలానికి చెందిన వారుగా తెలుస్తుంది. అర్ధరాత్రి సమయంలో జనసంచారం లేకపోవడంతో ఎటువంటి ప్రమాదం జరగలేదు. విద్యుత్ శాఖ అధికారులు సమాచారం అందుకుని రాత్రికి రాత్రే మరమ్మతులు చేశారు.


ప్రమాదానికి గురైన కారు ముందుభాగం

వెంకన్నకు విశేష పూజలు

శ్రీకాకుళం కల్చరల్: గుజరాతిపేటలోని నారాయణ తిరుమల వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులు గోత్రనామాలతో అర్చనలు చేయించారు. వేంకటరామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ నిర్వహించారు. పాత శ్రీకాకుళంలోని కల్యాణ వేంటేశ్వరస్వామి ఆలయంలో హరినామ సంకీర్తనలు, సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ, నక్షత్ర హారతులు జరిగాయి. బ్యాంకర్స్ కాలనీలోని శివకేశవ ఆలయం, చిన్నబజారులోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లోనూ భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


నారాయణ తిరుమలలోని స్వామివారు

జెమ్స్‌లో ఫ్రెషర్స్‌డే వేడుకలు


ఓథ్ నిర్వహిస్తున్న నర్సింగ్ కళాశాల విద్యార్థులు

శ్రీకాకుళం రూరల్: మండలంలోని రాగోలు జెమ్స్ ఆస్పత్రిలో బొల్లినేని మెడిస్కిల్స్‌లో నర్సింగ్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలు (ల్యాంప్ లైటింగ్) శనివారం ఉత్సాహంగా సాగింది. ఈ సందర్భంగా కళాశాల సీనియర్ ఫౌండర్ డాక్టర్ కె.సుధీర్ మాట్లాడుతూ వైద్యులు, నర్సులు సమాజానికి రెండు కళ్లని అభివర్ణించారు. నిజాయితీగా వృత్తి బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సంజీవరావు, వైద్య కళాశాల డైరెక్టర్ డాక్టర్ అంబేడ్కర్, బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులకు కొత్త కళ

- అమృత్ సరోవర్ కింద రూ.30 లక్షలతో మూడు చెరువులు అభివృద్ధి
- 80 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు

ఎచ్చెర్ల : అమృత్ సరోవర్ కార్యక్రమంతో గ్రామీణ ప్రాంత చెరువులు, జలాశయాలు కొత్త కళను సంతరించుకుంటున్నాయి. పూడికతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిన చెరువులు ఉపాధి పనులతో సరికొత్తగా రూపాంతరం చెందుతున్నాయి. ఎచ్చెర్ల మండలంలో ఇప్పటి వరకు మూడు చెరువుల్ని అమృత్ సరోవర్‌లో భాగంగా అభివృద్ధి చేయడంతో 80 ఎకరాల భూములకు పుష్కలంగా సాగునీటి సదుపాయం కలగనుంది. దీంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పొన్నాడ గ్రామంలో పగడబంద చెరువును రూ.9.78 లక్షలతో అభివృద్ధి చేశారు. చెరువు సామర్థ్యం పెరిగేలా మరింత లోతు చేసి, పూడికలు తొలగించి గట్లు పటిష్టం చేశారు. గట్లపై కొబ్బరి మొక్కలను నాటారు. దీని పరిధిలో 35 ఎకరాల ఆయకట్టు ఉంది. ఫరీదుపేటలో పోలమ్మ చెరువును లోతు చేసి గట్లను పటిష్టం చేశారు. దీనికి రూ.9.98 లక్షలు ఖర్చు చేశారు. ఈ చెరువు కింద 24 ఎకరాల ఆయకట్టు ఉంది. అల్లినగరంలో పిచ్చమ్మ కోనేరులో రూ.9.97 లక్షల వ్యయంతో అభివృద్ధి చేస్తున్నారు. దీని కింద 21 ఎకరాల ఆయకట్టు ఉంది.

రోజూ 300 మందికి ఉపాధి..

ఒక్కో చెరువులో రోజుకు 300 మంది వరకూ ఉపాధి వేతనదారులు పనిచేశారు. వ్యవసాయ పనుల్లేని సమయంలో వారికి ఉపాధి లభించడంతో పాటు చెరువులు కూడా పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకున్నాయి. రానున్న వర్షాకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురిస్తే చెరువులు నిండి ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందుతుందని అధికారులు చెబుతున్నారు. దశాబ్దాల తర్వాత ఊరి చెరువుల రూపురేఖలు మారడంతో ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పొన్నాడలోని పగడబంద చెరువు

సాగునీటికి ధీమా

అమృత్ సరోవర్ కార్యక్రమంలో భాగంగా ఉపాధి హామీ పథకం నిధులతో పొన్నాడ, ఫరీదుపేట, అల్లినగరం గ్రామాల్లో ఒక్కో చెరువు చొప్పున అభివృద్ధి చేశాం. ఈ చెరువుల కింద 80 ఎకరాల ఆయకట్టు ఉంది. వర్షాకాలంలో చెరువులు నిండి ఆయకట్టుకు సమృద్ధిగా నీరు అందుతుంది. – శోభాదేవి, ఉపాధి ఏపీఓ


చెరువు గట్లుపై వేసిన కొబ్బరి చెట్లు


అల్లినగరంలోని పిచ్చమ్మ కోనేరు